సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 9 । మే । 2024



చెప్పాడంటే.. చేస్తాడంతే!
సాయం చేసిన వారిని గుండెల్లో పెట్టుకుంటారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఐదేళ్లలో చక్కని పాలన అందించిన సీఎం జగన్‌ను జనం మెచ్చుకుంటున్నారు.
10లో



డెల్టాకు 3,100 క్యూసెక్కులు
ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 3,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.50 అడుగుల వద్ద నీటి మట్టం కొనసాగుతోంది.

గరిష్టం/కనిష్టం
36.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	31.0	24.0
కాకినాడ	36.5	24.4
అమలాపురం	36.0	26.0

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతపై సమీక్ష



'నన్నయ' వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్ వద్ద సెక్యూరిటీపై సమీక్షిస్తున్న సాధారణ పరిశీలకులు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద సెక్యూరిటీ సిస్టమ్‌పై సాధారణ పరిశీలకులు కె. బాలసుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్ సరోఛ, బలరామ్ మీనాలు బుధవారం సమీక్షించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 1,577 పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లు, సిబ్బంది నియామకం గురించి తీసుకున్న చర్యలను కలెక్టర్ కె. మాధవీలత, ఎస్పీ పి.జగదీష్ వారికి వివరించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఆయా నియోజకవర్గాలలోని పోలింగ్ బూత్‌ల నుంచి బ్యాలెట్ యూనిట్స్‌ని 'నన్నయ' వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌కి పటిష్టమైన భద్రతతో తరలించే విధానంపై రూట్ మ్యాప్‌ని సిద్ధం చేశామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియను సీసీ కెమెరాల నిఘాలో సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఈ నెల 12 , 13 తేదీలలో జారీ చేసే ప్రచార ప్రకటనలు మీడియా పర్యవేక్షణ, మీడియా ధ్రువీకరణ (ఎమ్ సి ఎమ్ సీ) విభాగం నుంచి రెండురోజులు ముందుగా అనుమతి పొందాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నుంచి అనుమతులు పొందాలన్నారు.

ప్రలోభాల పర్వం

- సమీపిస్తున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల యత్నం
- చివరకు ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ సైతం కొనుగోలు
- సామాజిక వర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుని మరీ ప్రలోభాలు
- అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తామంటూ అబద్ధపు హామీలు
- గంప గుత్తగా ఓట్లు కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు
- సంక్షేమ అజెండాతో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- ప్రజల్లో పార్టీపై పెరుగుతున్న ఆదరణ

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ, జనసేన, బీజేపీలను సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయం వెంటాడుతోందా..? అబద్ధపు హామీలతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారా..? మా ప్రభుత్వం వచ్చాక అది చేస్తాం.. ఇది చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారా..? అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి. సార్వత్రిక ఎన్నికల కీలక ఘట్టమైన పోలింగ్ గడువు సమీపిస్తున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులందరూ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అభివృద్ధే అజెండాగా ముందుకెళుతోంటే.. ప్రజా విశ్వాసం , నమ్మకం కోల్పోయిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మాత్రం ప్రలోభాల పర్వానికి తెర తీశారు. వృద్ధుల సౌకర్యార్థం ఎన్నికల కమిషన్ అమలు చేసిన హోం ఓటింగ్‌లో సైతం పెద్ద ఎత్తున ప్రలోభాలకు పాల్పడ్డారు. ఓటు హక్కు ఉన్న వృద్ధుల ఇళ్ల వద్ద పడిగాపులు కాసి మరీ ఓట్లు కొనుగోలు చేసిన దాఖలాలున్నాయి. ఇళ్ల వద్దకు ద్వితీయ శ్రేణి నాయకులను పంపి తమ అభ్యర్థికి ఓటేయాలని కవర్లు అందించినట్లు సమాచారం. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని బట్టి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ముట్టజెప్పినట్లు తెలిసింది.

పగలు ప్రచారం.. రాత్రుళ్లు పంపిణీలు

పోలింగ్‌కు తక్కువ సమయం ఉండటంతో ప్రచారాలు ముమ్మరం చేస్తున్నారు. పగలు ప్రచారం, రాత్రిళ్లు ప్రలోభాలకు తెర తీస్తున్నారు. కుటుంబాల వారీగా ఎంపిక చేసుకుని రహస్యంగా కలుస్తున్నారు. వారికి ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. మీకేం కావాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు సపోర్ట్ చేస్తే ఎన్నికల్లో గెలిచాక మిమ్మల్ని బాగా చూసుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఓటుకింత అని గంపగుత్తగా డబ్బులు అందజేస్తున్నట్లు తెలిసింది. చీరలు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు.



ముమ్మరంగా కమ్యూనిటీ సమావేశాలు

ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓట్లున్న సామాజిక వర్గాలను ఎంపిక చేసుకుని వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయా సామాజిక వర్గ ఓటర్లను ఆకర్షించేందుకు నానా తిప్పలు పడుతున్నారు. టీడీపీ హయాంలో చేసిందేమీ లేదని.. తిరిగి ఇప్పుడొచ్చి దొంగ హామీలు ఎందుకిస్తున్నారని సామాజిక వర్గ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ సారి కచ్చితంగా చేస్తామంటూ బూటకపు మాటలతో మభ్యపెడుతున్నారు. రాజమండ్రి సిటీ, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థుల తీరు ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. సమావేశాలకు వచ్చిన వారికి తాయిలాల ఎర వేస్తున్నారు. రూ.3వేల నుంచి రూ.5 వేలు కవర్లలో పెట్టి ఇచ్చి పంపుతున్నారు. కొన్ని సంఘాల నాయకులు మాత్రం తమకు తక్షణం సంఘ భవనం, ఇతర అవసరాలు తీర్చాలని డిమాండ్ చేస్తుంటే ఎన్నికలయ్యాక చూద్దామంటూ ముఖం చాటేస్తున్నట్టు తెలిసింది. డబ్బు, మద్యం పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాపారుల నుంచి భారీగా మద్యం కొనుగోలు చేసి తమ రహస్య స్థావరాల్లో నిల్వ ఉంచుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే ఓటుకు ఇంత అని డబ్బు పంచే ప్రక్రియకు నాంది పలుకగా.. మరికొన్ని చోట్ల మనీ ట్రాన్స్‌ఫర్ పద్ధతి, నేరుగా పంపిణీకి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

చేరికల కలరింగ్

పార్టీలో చేరికల పేరుతో హడావుడి చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల కార్యాలయాల్లో నిత్యం కండువాలు కప్పించే కార్యక్రమం తంతుగా మారుతోంది. పార్టీపై ఇష్టంతో చేరుతున్నారా? వీరి వల్ల నిజంగా పార్టీకి ఉపయోగమా..? అనే విషయాన్ని పక్కన బెట్టేస్తున్నారు. పార్టీలో వందలాది మంది చేరుతున్నారని ప్రకటించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మైండ్‌గేమ్ ఆడుతున్నారు. టీడీపీ నాయకులు, వాళ్ల వద్ద పనిచేసే వ్యక్తులకే కండువాలు కప్పేసి పార్టీలో చేరినట్లు కలరింగ్ ఇస్తున్నారు. ఇటీవల రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి టీడీపీ పార్టీకి చెందిన మండల అధ్యక్షుడికి కండువా కప్పి పార్టీలోకి చేరినట్లు నమ్మించే ప్రయత్నం చేసి నవ్వులపాలయ్యారు. అప్పటి వరకు ఒక పార్టీలో ఉన్న చోటా నాయకుడు తెల్లారేసరికి ప్రత్యర్థి పార్టీలో కండువా కప్పుకుంటున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఇదే తంతును కొనసాగిస్తున్నాయి. ఇందుకోసం భారీ నజరానాలు సమర్పించుకుంటున్నారు. 100 ఓట్లు ప్రభావితం చేయగలిగిన ప్రత్యర్థి పార్టీల నాయకులకు రూ.లక్షల తాయిలాలిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నేతలనే టార్గెట్ చేసుకుని మరీ ప్రలోభాలకు పాల్పడుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై కన్ను

ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌పై కన్నేసిన టీడీపీ నేతలు వాటిని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. రాజమండ్రి సిటీలో అయితే ఒక్కో ఓటుకు రూ.2,500 వరకు ముట్టజెప్పినట్లు తెలిసింది. నిడదవోలులో రూ.1,000, గోపాలపురం రూ.1,500 ఇలా నియోజకవర్గానికి ఒక ధర నిర్ణయించి మరీ యథేచ్ఛగా కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే కుటుంబంలో రెండు నుంచి మూడు ఓట్లుంటే ఆ కుటుంబాన్ని కాకాపట్టి మరీ ఓట్లు అభ్యర్థించినట్లు తెలిసింది.

సంక్షేమమే అజెండాగా వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సంక్షేమమే అజెండాగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, వాటి ఫలాలు ప్రజలకు చేరిన తీరును వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను గుర్తిస్తున్న ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్నారు. తిరిగి మిమ్మల్నే గెలిపిస్తామని బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

పాలిసెట్‌లో 'టాప్'లేపారు

- జిల్లా విద్యార్థులకు ర్యాంకుల పంట
- ఇద్దరికి స్టేట్ ఫస్ట్, ఇద్దరికి స్టేట్ సెవెన్త్ ర్యాంకులు
- 88.77 శాతం ఉత్తీర్ణత



చల్లా నాగ వెంకట సత్యశ్రీవర్షిణి
ర్యాంకు:1



జొన్నలగడ్డ యశ్వంత్‌సాయి
ర్యాంకు:1



దేవ శ్రీవేద్
ర్యాంకు : 7



గొల్ల ప్రభావ్‌తేజ
ర్యాంకు : 7

రాజమహేంద్రవరం రూరల్: పాలిసెట్–2024 ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా విద్యార్థులు టాప్ లేపారు. తూర్పుగోదావరి జిల్లా విద్యార్థులు నలుగురిలో ఇద్దరు స్టేట్‌ఫస్ట్ ర్యాంకులు, ఇద్దరు సెవెన్త్ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి గత నెల 27వ తేదీన పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష కట్టుదిట్టమైన ఏర్పాట్లు నడుమ నిర్వహించారు. ఈ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షల్లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చల్లా నాగ వెంకట సత్యశ్రీవర్షిణి, జొన్నలగడ్డ యశ్వంత్ సాయి ప్రథమ ర్యాంకులు, దేవశ్రీవేద్, గొల్ల ప్రభావ్ తేజ్ ఏడవ ర్యాంకులు సాధించడం విశేషం. జిల్లాలో 4,791 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరు కాగా, 4,253మంది 88.77 శాతంతో పాలిసెట్‌లో అర్హత సాధించారని జిల్లా కోఆర్డినేటర్, బొమ్మూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు.

ప్రగతి పరుగులు

- జిల్లాలో కీలకంగా రాజానగరం నియోజకవర్గం
- విద్య, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయం
- మధురపూడి విమానాశ్రయం తలమానికం





కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఓటర్ల వివరాలు మొత్తం ఓటర్లు - 2,16,491

పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు
216	1,06,879	1,03,017	6

రాజానగరం: జిల్లాల పునర్విభజనతో గోదావరికి అటు మూడు, ఇటు నాలుగు నియోజకవర్గాలతో కలసి ఏర్పడిన నవ్య తూర్పు గోదావరి జిల్లాలో రాజానగరం నియోజకవర్గం అత్యంత కీలకంగా మారింది. అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కలిగి ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ, ఎయిర్ పోర్టు, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)తో పాటు శ్రీలక్ష్మీ నరసింహస్వామి వెలసిన ప్రసిద్ధ కోరుకొండ పుణ్యక్షేత్రం కూడా ఈ నియోజకవర్గంలోనే ఉంది. సీజన్ ఏదైనా సాగులో, పంట కోతల్లో ముందంజ వేస్తూ ఆదర్శంగా నిలిచే అన్నదాతలున్న ప్రాంతం కూడా ఇదే. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్‌గానూ ఈ నియోజకవర్గం నిలుస్తుంది.



మధురపూడి విమానాశ్రయం



2009లో ఆవిర్భావం

2009లో జరిగిన శాసన సభ నియోజకవర్గాల పునఃర్విభజనతో రాజానగరం కేంద్రంగా కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలతో ఈ నియోజకవర్గం ఏర్పడింది. అంతకు ముందు కడియం నియోజకవర్గంలో రాజానగరం, బూరుగుపూడి నియోజకవర్గంలో సీతానగరం, కోరుకొండ మండలాలు ఉండేవి. వీటిలో సీతానగరం గోదావరి పరివాహక ప్రాంతం , కోరుకొండ, రాజానగరం చాగల్నాడుగా పిలువబడే మెట్ట ప్రాంతాలు. సాగునీటి సదుపాయాలు సమృద్ధిగా లేని ఈ ప్రాంతంలో చాగల్నాడు, పుష్కర, వెంకటనగరం, తొర్రిగడ్డ వంటి ఎత్తిపోతల పథకాలతోపాటు భూగర్భ జలాలను ఉపయోగించి రైతులు సేద్యం చేస్తారు.

పంటల సాగు

వరి, పొగాకు, మొక్కజొన్న, మిరప, కూరగాయలను పండిస్తారు. రాజానగరం మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వరి పంటను ఇతర ప్రాంతాల కంటే ముందుగానే సాగు చేయడంతో పాటు కోతలు కూడా చేపడతారు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) నియోజకవర్గంలో (కలవచర్ల)నే ఉంది.

జలదాత

ఇక్కడి ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంలోనే కాకుండా జగ్గంపేట, తుని, విశాఖపట్నాలకు కూడా గోదావరి జలాలను అందిస్తూ జలదాతగా రాజానగరం నియోజకవర్గం విరాజిల్లుతుంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను 65 వేల ఎకరాలకు సరఫరా చేస్తున్నారు. అలాగే పైపులైన్ల ద్వారా విశాఖపట్నానికి తాగునీరు అందిస్తున్నారు. త్వరలో పూర్తి కానున్న పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ఈ నియోజకవర్గం నుంచే ప్రారంభమవుతుంది. చాగల్నాడు, వెంకటనగరం ఎత్తిపోతల పథకాల ద్వారా ఈ ప్రాంతం మీదుగానే మరో 48,500 ఎకరాలకు సాగు, తాగు నీటిని పంపిణీ చేస్తున్నారు.

ఇప్పటివరకూ పనిచేసిన ఎమ్మెల్యేలు

నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 2009లో జరిగిన ఎన్నికలలో టీడీపీకి చెందిన పెందుర్తి వెంకటేష్ విజయం సాధించారు. 2014లో ఆయన మరోసారి గెలిచారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున జక్కంపూడి రాజా గెలుపొందారు.

సంక్షేమ పథకాలు అందించారిలా..

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న అమ్మ ఒడి	61,449	142.91
జగనన్న వసతి దీవెన	10,472	18.77
జగనన్న విద్యా దీవెన	17,433	57.14
జగనన్న చేదోడు	2,047	4.51
జగనన్న తోడు	6,110	0.29
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	12,066	48.43
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	7,951	6.16
వైఎస్సార్ ఆసరా	51,396	177.64
వైఎస్సార్ కాపు నేస్తం	8,927	39.20
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2,140	5.82
వైఎస్సార్ చేయూత	15,315	87.69
వైఎస్సార్ సున్నావడ్డీ	60.695	12.38
వైఎస్సార్ బీమా	845	12.64
వైస్సార్ పెన్షన్ కానుక	46,860	497.95
జగనన్న విదేశీ విద్యా దీవెన	2	0.34
సున్నా వడ్డీ పంట రుణాలు	9,427	2.07
వైఎస్సార్ రైతు భరోసా	34,578	155.68
రైతు ఇన్‌పుట్ సబ్సిడీ	9255	9.22
మత్స్యకార భరోసా	41	0.07
పంట బీమా	6937	12.95
వైఎస్సార్ లా నేస్తం	11	0.07
వైఎస్సార్ నేతన్న నేస్తం	22	0.22
వైఎస్సార్ వాహనమిత్ర	2382	7.82
సీఎం రిలీఫ్ ఫండ్	1153	9.53
అర్చకులు	136	0.07
పాస్టర్లు	302	0.15
కల్యాణమస్తు	149	1.14
కోవిడ్ అసిస్టెంట్	76,536	7.65
హౌసింగ్ డీబీటీ	5408	58.32
మొత్తం	రూ. 1376.83 కోట్లు	

విద్యారంగానికి కేంద్రం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోని 436 కళాశాలను అనుబంధంగా కలిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీతో పాటు జీఎస్ఎల్ వైద్య కళాశాల, జీఎస్ఎల్, లెనోరా దంత వైద్య కళాశాలలు, ఏడు ఇంజినీరింగ్ కళాశాలలు, నాలుగు ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. అలాగే రెండు డిగ్రీ, ఐదు జూనియర్ కళాశాలలతో పాటు బీఈడీ, డీఎడ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి.



ఆదికవి నన్నయ యూనివర్సిటీ

క్లుప్తంగా

వస్త్ర దుకాణంలో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తుని: స్థానిక పెంటకోట రోడ్డులోని పుష్పాంజలి వస్త్ర, రెడీమేడ్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో షాపు యాజమాని రెడ్డి సూరిబాబు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో షాపులో పనిచేస్తున్న సిబ్బంది భోజనానికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారి రాముడు మాట్లాడుతూ మూడు గంటల పాటు శ్రమిస్తే మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. భారీగా నష్టం జరిగిందని భావిస్తున్నామన్నారు.

వైభవంగా తలుపులమ్మ జాతర



ఆకట్టుకున్న కేరళ బృందం ప్రదర్శన

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. 13 రోజులు జరిగిన ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా లోవదేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో లోవకొత్తూరు గ్రామంలో వివిధ సాంఘిక, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థం, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వి.కొత్తూరు, కుమ్మరిలోవ, రాజుపేట, మర్లపాడు, సీత్యపేట, కొత్త వెలంపేట, వెలంపేట కాలనీ, జగన్నాథగిరి గ్రామాల్లో ఉత్సాహంగా జాతరలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా పేలుళ్లతో ఉత్సవాలను భారీగా నిర్వహించారు.

ప్రతిభ ఉంటే.. ఉపకారం మీ వెంటే

- విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్ షిప్స్
- జూన్ 7 వరకు దరఖాస్తుకు గడువు



రాయవరం: చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో అమలవుతోంది. ఇప్పటి వరకు ఈ పథకం కింద 6,500 మందికి పైగా ఆర్థిక సహాయం, 27,600 మంది వరకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు రెండేళ్ల పాటు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థి చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ ఉపకార వేతనం అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ద్వారా భవిష్యత్‌కు అవసరమైన దిశానిర్దేశం చేస్తారు.

విద్యార్థుల అర్హతలు

సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం పొందాలంటే ఆ విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షల లోపు ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులు. పదిలో కనీసం 90 శాతం మార్కులు సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు రావాలి.

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. జూన్ 23న దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 20 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

Vidyadhan
Transforming lives through education
A Shibulal Family Philanthropic Initiative

జూన్ 7వ తేదీ వరకూ గడువు

విద్యాదాన్ ఉపకార వేతనం కోసం జూన్ 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, చదువుతున్న కళాశాల వివరాలను పొందుపర్చాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగతంగా సొంత ఈ మెయిల్ కలిగి ఉండాలి. నెట్ సెంటర్, ఇతరుల ఈ మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అందుకే సొంత ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకుని, దాని పాస్‌వర్డ్ గుర్తుంచుకోవాలి. మరిన్ని వివరాల కోసం సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విద్యాదాన్.ఆంధ్రఃఎస్‌డీ ఫౌండేషన్‌ఇండియా.కామ్ సంప్రదించాలి. లేదా 96635 17131 నంబర్‌లో సంప్రదించవచ్చు.

దరఖాస్తు చేసుకునే విధానం

- విద్యార్థులు ప్లేస్టోర్‌లోని విద్యాదాన్ యాప్, లేదా విద్యాదాన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాదాన్.ఓఆర్‌జీలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదో తరగతి మార్కుల జాబితాల ప్రకారం మీ పేరులో మొదటి పేరును ఎంటర్ చేయాలి. తర్వాత రెండో పేరును నమోదు చేయాలి. అనంతరం విద్యార్థి సొంత చిరునామాను నమోదు చేయాలి.
- అనంతరం అప్లయ్ నౌ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే మీ ఈ మెయిల్‌కు మీ అకౌంట్ యాక్టివేషన్ కోసం లింక్ వస్తుంది. యాక్టివేషన్ లింక్ క్లిక్ చేయగానే విద్యాదాన్ హోమ్ పేజీలో అకౌంట్ యాక్టివేటెడ్ అనే మెసేజ్ కనిపిస్తుంది.
- ఈ మెయిల్ ఐడీ, విద్యాదాన్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయితే స్టెప్–2లోకి వెళతారు. లాగిన్ అయిన తర్వాత హెల్ప్‌పై క్లిక్ చేసి, సూచనలు చదివి, దాని ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. అప్లికేషన్ పూర్తి చేసిన తర్వాత ఎడిట్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్‌ను ఎడిట్ చేసుకోవచ్చు.
- ఎంటర్ చేసిన తర్వాత సబ్మిట్‌పై క్లిక్ చేయాలి. సబ్మిషన్ సక్సెస్‌ఫుల్ అని చూపిస్తుంది. డాక్యుమెంట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అప్‌లోడ్ చేసిన తర్వాతే దరఖాస్తును అంగీకరిస్తారు.
- విద్యార్థులు ఎప్పటికప్పుడు ఈ మెయిల్‌ను చెక్ చేసుకోవాలి. ఎస్‌డీఎఫ్ ప్రతి సమాచారాన్ని ఈ మెయిల్ ద్వారా తెలియజేస్తుంది.

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి మొదట విడత అడ్మిషన్లకు పదో తరగతి, ఆపై అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. ఆసక్తి కలవారు ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో గురువారం నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకుని రశీదు పొందాలన్నారు. వారందరికీ ఈ నెల 10 నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 92940 50231 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ ఆధ్వర్యంలో ఈసెట్–24 ఆన్‌లైన్ పరీక్షను బుధవారం కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాలలో బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 2,140 మంది దరఖాస్తు చేసుకోగా 2,094 మంది హాజరయ్యారు. కాకినాడ అచ్యుతాపురం అయాన్ ఆన్‌లైన్ కేంద్రంతో పాటు సూరంపాలెం ప్రగతి, ఆదిత్య కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని కన్వీనర్ భానుమూర్తి తెలిపారు.

అర్ధరాత్రి పచ్చమూకల బరి తెగింపు

- హోంమంత్రి బస చేసిన ఇంటిపై టీడీపీ వర్గీయుల దాడి
- 14 బైక్‌లు ధ్వంసం, ఆరుగురికి గాయాలు
- సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారాలతో పోలీసులకు మంత్రి వనిత ఫిర్యాదు



విలేకర్లతో మాట్లాడుతున్న హోంమంత్రి వనిత



దాడిలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ పార్టీ అభ్యర్థులకు లభిస్తున్న ప్రజాదరణను చూసి పచ్చమూకలు తట్టుకోలేకపోతున్నాయి. ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతూ బరితెగించి దాడులకు పాల్పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఎన్నికల ప్రచారం అనంతరం నల్లజర్లలో హోంమంత్రి తానేటి వనిత బస చేసిన వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటిపై మంగళవారం అర్ధరాత్రి టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, గోపాలపురం టీడీపీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుతో సహ దాదాపు 30 నుంచి 40 మంది దాడి చేశారు. ఇనుపరాడ్లు, సర్వే కర్రలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. హోంమంత్రి ఉన్న గది తలుపులను పగులగొట్టడానికి విఫలయత్నం చేశారు. మరో రెండు గదుల తలుపులు పగులగొట్టారు. 14 బైక్‌లతో పాటు కుర్చీలు, ఫర్నిచర్, డీజే వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో స్థానిక పోలీసు అధికారులు అక్కడే ఉన్నా టీడీపీ వర్గీయులను నిలవరించలేకపోయారు. టీడీపీ వర్గీయుల దాడిలో వల్లూరి శేషగిరిరావు, ముత్తిన నరేష్, ఏపూరి క్రాంతి, రాయుడు గంగాధరరావు, ఆలపాటి రాంభాస్కరరావు, పాతూరి సత్యనారాయణ గాయపడ్డారు. దీనిపై తనపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీసీ ఫుటేజ్‌ల ఆధారాలతో మంత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నాయకులకు ఓటమి భయం: మంత్రి వనిత

హోంమంత్రి తానేటి వనిత విలేకరులతో మాట్లాడుతూ ఒక దళిత మహిళ హోంమంత్రిగా ఉండటం, రాబోయే ఓటమిని జీర్ణించుకోలేక పోవడం, నల్లజర్లలో పెద్దెత్తున ర్యాలీ, ఎన్నికల ప్రచారం జరగడం తట్టుకోలేక తనపైనా, తమ కార్యకర్తలపైనా, నాయకులపైనా టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారన్నారు. వీళ్లచేసే అరాచకాలను చూస్తుంటే మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామో లేదో అర్థం కావడం లేదన్నారు. నిర్దిష్ట సమయానికి ప్రచారం ఆపి, మా నాయకుడి ఇంట్లో బస చేస్తే, దౌర్జన్యం చేయటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. సెక్యూరిటీ రక్షణగా ఉండటంతో తాను ప్రాణాలతో బయటపడ్డానన్నారు. ఎన్నికల బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి కూడా దాడికి రావడం చూస్తుంటే వారిలోని ఓటమి భయం బహిర్గతమైందన్నారు. కాగా.. ఈ ఘటనపై నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ సమన్వయం పాటించాలని సూచించారు.

8 మంది టీడీపీ నాయకులపై కేసు



రామారావు, డీఎస్పీ

హోంమంత్రి తానేటి వనితపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి 8 మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ రామారావు బుధవారం ఉదయం విలేకరులకు తెలిపారు. వారిలో జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఉన్నారన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసులు నమోదయ్యాయన్నారు. నల్లజర్లలో ఎటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ముందస్తుగా 144 సెక్షన్ విధించినట్టు చెప్పారు.



పిఠాపురంలో స్థలాలను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం తదితరులు

పిఠాపురంలో సీఎం జగన్ ఎన్నికల సభ

స్థలాలను పరిశీలించిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిఠాపురంలో ఎన్నికల ప్రచారానికి రానున్న నేపథ్యంలో సభ నిర్వహించే స్థలాలను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం బుధవారం పరిశీలించారు. పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ తదితర ప్రాంతాల్లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. జనం భారీగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. వాటినన్నింటినీ పరిశీలించి ఎక్కడ నిర్వహించేదీ నిర్ణయించనున్నారు. రఘురాం వెంట రాష్ట్ర భూదానం బోర్డు చైర్మన్ తాడి విజయ భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గండేపల్లి బాబీ ఉన్నారు.

10 వరకూ తత్కాల్‌లో ఇంటర్ ఫీజుకు అవకాశం

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వాటికి ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులకు తత్కాల్ స్కీమ్‌లో అవకాశం ఉందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. తత్కాల్ స్కీమ్ కింద విద్యార్థులు రూ.మూడు వేలు జరిమానాగా చెల్లించాలని, ఈ విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల పదో తేదీ సాయంత్రం మూడు గంటల లోపు ఫీజు చెల్లించాలని సూచించారు.

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును తత్కాల్ స్కీమ్ ద్వారా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల లోపు ఆన్‌లైన్ విధానంలో చెల్లించవచ్చునని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారి ఎల్.నరసింహం తెలిపారు.

జగన్ పాలనలోనే ముస్లింలకు రక్షణ

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ఆజం



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ఆజం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింలకు రక్షణ సాధ్యమని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం అన్నారు. స్థానిక జాంపేటలోని హబీబుల్లాఖాన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థులు మార్గాని భరత్ రామ్ (రాజమహేంద్రవరం సిటీ), చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (రూరల్), జక్కంపూడి రాజా (రాజానగరం) తరఫున ఎన్నికల ప్రచారం చేసేందుకు రెండు రోజులుగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ ఒక తాటిపైకి వచ్చి జగన్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు చెందిన 50 లక్షల మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలు అందుకున్నారన్నారు. సుమారు 850 మంది పైగా పదవులు పొందారని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేనల పొత్తు అక్రమమన్నారు. బీజేపీకి ఓటువేస్తే దేశం నుంచి ముస్లింలను తరిమి వేస్తుందని హెచ్చరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, అప్పుడే అనేక వేల మంది ఉద్యోగాలు పొంది మంచి స్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 14 ఏళ్లు పాలించినా ముస్లింలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ కూటమి పార్టీలు తోడు దొంగలని అన్నారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఆరిఫ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నిజాం, సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆరిఫుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.